క్లుప్తంగా

ముద్రగడను కలిసిన నాయకులు



కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభంను కలిసిన వర్మ

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు (పీఏసీ) ముద్రగడ పద్మనాభంను కిర్లంపూడిలోని ఆయన స్వగృహంలో కాపు జేఏసీ నాయకులు, పిఠాపురం టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు కాపు జేఏసీ నాయకులు ఆకుల రామకృష్ణ, నల్లా విష్ణు, వాసిరెడ్డి ఏసుదాసు, నల్లా పవన్, మిరియా శ్రీను ముద్రగడను కలిసి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉల్లాస్ వలంటీర్ టీచర్స్‌కు శిక్షణ

గండేపల్లి: మండలంలోని గండేపల్లిలో ఉన్న మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉల్లాస్ వలంటీర్ టీచర్స్‌కు మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్టు ఏపీఓ సన్యాసిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్షర ఆంధ్ర గణాంక సహాయకులు పోలిశెట్టి రాజేష్, ఎంపీడీఓ చంద్రరావు, ఎంఈఓ నాయక్, సీసీ, వీఓఏ తదితరులు పాల్గొన్నారు.

మోతాదు మించితే ముప్పే

కోటనందూరు: వరిలో ఎరువుల వినియోగం మోతాదు మించితే నష్టం వాటిల్లుతుందని ఏఓ చంద్రశేఖర్ అన్నారు. ఎస్సార్‌పేట, బిళ్ల నందూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ, వరిసాగులో యూరియాను తగిన మోతాదులో మాత్రమే వేయాలన్నారు. మోదాదు మించితే ప్రయోజనం లేకపోగా తెగుళ్ల ఆశించే ప్రమాదం ఉందన్నారు. డ్రోన్ వినియోగంపై ప్రయోగాత్మకంగా రైతులకు వినియోగించారు. కార్యక్రమంలో ఏఈఓలు జగ్గప్పారావు, సురేష్ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

శంఖవరం: గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ యోజన కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు మంగళవారం నిర్వహించామని వైద్యుడు శెట్టిబత్తుల రాజీవ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ, 25 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించి మందులు, పౌష్టికాహారం చేశామన్నారు. ప్రతి నెల 9న ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అలాగే పి.మల్లాపురం పీహెచ్‌సీలో 20 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని చెప్పారు.

గర్భిణుల్లో అత్యధికం రక్తహీనత ఉన్నవారే

ప్రత్తిపాడు: పట్టణ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కి వచ్చే గర్భిణుల్లో అత్యధికులు రక్తహీనత కలవారేనని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య మైఖేల్ అన్నారు. ప్రత్తిపాడు సీహెచ్‌సీలో మంగళవారం గర్భిణులకు ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, శరీరంలో సరిపడ రక్త శాతం లేకపోతే పురుడు సమయంలోనూ, ఒకవేళ శస్త్ర చికిత్స అవసరమైన సందర్భంగా ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఒక్కోసారి ప్రాణాపాయం కూడా వాటిళ్ల వచ్చనన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే కాన్పు కూడా సునాయాశమవుతుందన్నారు. గర్భంలో బిడ్డ ఎదుగుదలకు, నిత్యం తీసుకునే ఆహార అలవాట్లు, ఎప్పటికప్పుడు వైద్య సహాయం, తల్లీబిడ్డల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

750 కిలోల రేషన్ బియ్యం సీజ్

తొండంగి: మండలంలోని అక్రమంగా నిల్వ ఉంచి 750 కిలోల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్టు ఎంఎస్ఓ బి.రాజు మంగళవారం తెలిపారు. కొమ్మనాపల్లిలో ఎస్.తాతారావు సైకిల్‌పై రేషన్ బియ్యం బ్యాగ్‌ను గుర్తించి వెంబడించగా ఓ ఇంట్లో 21 బ్యాగులు (750 కిలోల) రేషన్ బియ్యం గుర్తించామన్నారు. దీనిపై 6ఏ కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. ఆయన వెంట వీఆర్వో విజయ్‌కుమార్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శంఖవరం: కత్తిపూడి– శంఖవరం రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరి వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. శంఖవరం మండలం కొత్తూరుకి చెందిన కర్రి రాజుబాబు, గోవిందు బైక్‌పై శంఖవరం వచ్చి తిరిగి కొత్తూరు వెళ్లుతుండగా అధిక లోడుతో వస్తున్న టిప్పర్ సిద్ధవారి చెరువు వద్ద బలంగా బైక్ వెనుక భాగంలో ఢీకొట్టింది, ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. బాధితులను స్థానికులు తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జీఎస్టీ సవరణతో సామాన్యుడికి మేలు

బోట్‌క్లబ్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో పలు సవరణలు చేయడంతో అవి సామాన్యులకు ఎంతో మేలు చేస్తాయని బీజేపీ రాష్ట్ర భవన నిర్మాణ కమిటీ సభ్యులు, ఇంజినీర్ గట్టి సత్యనారాయణ తెలిపారు. స్థానిక భానుగుడి సెంటర్‌లో మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. విద్య, ఆరోగ్యం, గృహోపకరణాలకు భారీగా జీఎస్టీ శ్లాబు తగ్గించడంతో వ్యాపారులకు, సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భానుగుడి సెంటర్‌లోని పలువురు వ్యాపారులు, బీజేపీ నాయకులు కృష్ణ, గంగాధర్ పాల్గొన్నారు.



కిర్లంపూడి నుంచి నాయకులతో కలిసి ఆర్డీవో ఆఫీసుకు బయలుదేరిన గిరిబాబు



అన్నదాత పోరులో నిరసన తెలుపుతున్న గోకవరం వైఎస్సార్ సీపీ నాయకులు



అన్నదాత పోరులో పాల్గొన్న ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ శ్రేణులు



కోటనందూరు నుంచి అన్నదాత పోరుకు తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

అన్నదాతల గర్జన

- యూరియా కోసం కదం తొక్కిన రైతులు
- పెద్దాపురంలో నాలుగు నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ఆందోళన
- పోలీసులు అడ్డుకున్నా కట్టలు తెంచుకున్న ఆవేశం

సామర్లకోట: రైతుల్లో ఆవేశం కట్టలు తెంచుకోవడంతో బారికేడ్లు కూడా వారిని ఆపలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు యూరియా అందక అన్నదాత ఆందోళన చెందుతుండడంతో వైఎస్సార్ సీపీ నేత జగన్‌మోహన్ రెడ్డి రైతులకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా మంగళవారం ప్రతి రెవెన్యూ డివిజన్ కార్యాలయాల వద్ద అన్నదాత పోరు పేరుతో ధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. దాంతో తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం నియోజకవర్గాల నుంచి రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌కు తరలివచ్చారు. దాంతో మున్సిపల్ సెంటర్ వైఎస్సార్ సీపీ జెండాలతో నిండిపోయింది. అక్కడి అంబేడ్కర్ భవనంలో రైతులకు, పార్టీ శ్రేణులకు నియోజకవర్గ పార్టీ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఎరువులు అందకపోవడంతో రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తుని నియోజకవర్గ, కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దాడిశెట్టి రాజాతో పాటు, జగ్గంపేట, ప్రత్తిపాడు, పెద్దాపురం నియోజకవర్గాల కో–ఆర్డినేటర్లు తోట నరసింహం, ముద్రగడ గిరిబాబు, దవులూరి దొరబాబు నాయకత్వంలో పార్టీ శ్రేణులు, రైతులు ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నాకు పాదయాత్రగా బయలుదేరుతూ.. ముందుగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం వారి పాదయాత్రను పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. అప్పటికే యూరియా అందక ఆవేశంలో ఉన్న రైతులు వాటిని తోసుకుంటూ ముందుకు సాగారు. ఆర్డీఓ కార్యాలయం వద్ద అదనపు ఎస్పీ శ్రీనివాస్, సీఐలు వైఆర్‌కె శ్రీనివాస్, ఎ.కృష్ణభగవాన్, ఎస్సైలు మౌనిక, అడపా గరగారావు, ప్రత్యేక పోలీసు బలగాలు ఆందోళనకారులను అడ్డుకొని కేవలం 10 మంది ముఖ్యనేతలనే అనుమతిస్తామని తెలిపారు. అయినప్పటికీ ఆగకుండా సుమారు 200 మంది రైతులు ఒక్కసారిగా గేట్లు తోసుకుంటూ ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోనికి ప్రవేశించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఆర్డీఓ కార్యాలయ గేట్లు మూసివేశారు. కార్యాలయ ఆవరణలో దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైతులకు సకాలంలో యూరియా అందజేయాలని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని నినాదాలు చేశారు. ఆందోళన అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కో–ఆర్డినేటర్లు విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు.



పెద్దాపురంలో కదం తొక్కిన రైతులు

ఎంత అణచివేస్తే అంత తిరుగుబాటు..

ఆందోళనకారులను ఎంత అడ్డుకుంటే అంత తిరుగుబాటు వస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, డివిజన్ కార్యాలయానికి చేరుకోవడానికి పోలీసులు రైతు సంఘ నాయకులను, పార్టీ నాయకులను గృహ నిర్బంధం చేయడం, దారి పొడవునా అడ్డుకున్నారన్నారు. అయినా పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చారని పేర్కొన్నారు. యూరియా కొరత లేదన్న ముఖ్యమంత్రి ఆ అంశంపై సమీక్షలు చేయాలనడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10 ఎకరాలు కౌలుకు చేస్తున్న రైతుకు కూడా కేవలం ఒక బస్తా యూరియా మాత్రమే ఇవ్వడం దారుణమన్నారు. అన్నదాతకు తమ పార్టీ మద్దతు ఇవ్వడంతో సోమవారం అత్యవసరంగా కూపన్లు ఇచ్చారని, రైతులు పండిస్తున్న ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదని ఆయన ఆరోపించారు. టీడీపీ నాయకుల వద్దకు చేరుతున్న యూరియాను బస్తాకు రూ.100 నుంచి రూ.200 అదనంగా వేసి విక్రయిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు.

బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి

రైతులకు అందాల్సిన ఎరువులను టీడీపీ నాయకులు బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ కో–ఆర్డినేటర్ తోట నరసింహం ఆరోపించారు. ఎరువుల షాపుల వద్ద ఎరువులు లభించడం లేదని టీడీపీ నాయకులు రూ.270 ఉన్న యూరియా బస్తాను రూ. 500కు విక్రయిస్తున్నారన్నారు.



నాలుగు నియోజకవర్గాల కో–ఆర్డినేటర్లు రాజా, గిరిబాబు, తోట నరసింహం, దొరబాబు ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా

రైతులకు క్షమాపణ చెప్పాలి

ఎరువులను అందించడంలో విఫలమైన ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు క్షమాపణ చెప్పాలని ప్రతిపాడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ్డ గిరిబాబు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులు ఏ మేరకు పంటలు వేస్తున్నారో ముందుగా తెలుసుకుని ఎరువులను ఏర్పాటు చేయకపోవడం సిగ్గు చేటన్నారు. ప్రతిపాడులో 500 మెట్రిక్ టన్నులు కావలసి ఉండగా 100 టన్నులు కూడా ఏర్పాటు చేయలేదన్నారు.

ఆకట్టుకున్న ఎడ్లబండి ప్రదర్శన..

పెద్దాపురంలో నిర్వహించిన అన్నదాత పోరులో ఎడ్లబండి ప్రదర్శన ఆకట్టుకుంది. రైతులకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్లు దాడిశెట్టి రాజా, ముద్రగడ్డ గిరిబాబు, దవులూరి దొరబాబు ఎడ్లబండి ఎక్కి నిరసన తెలిపారు. రైతులకు వెంటనే ఎరువులను అందజేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు యనమల కృష్ణుడు, తోట రాంజీ, ఓమ్మి రఘురామ్, రావిశెట్టి జెమిలీ, కరణం భాను, ఆవాల లక్ష్మీనారాయణ, లగుడు శ్రీనివాసు,ఎ పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు ఊబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, పార్టీ జెడ్పీ విభాగం అధ్యక్షు డు మోరంపూడి శ్రీరంగనాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అత్తిలి వెంకటసీతారామస్వామి, పెద్దాపురం వైస్ ఎంపీపీ మిరియాల రాజు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ వారా సుధాకర్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సేపెని రూప, పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బంగారు కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు వీరబాబు, జిల్లా అధికార ప్రతినిధి వినుకొండ విష్ణుచక్రం, పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తాటికొండ అచ్చిరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్, బ్రహ్మనాయుడు యువజన సంఘ జిల్లా అధ్యక్షుడు ఆదపురెడ్డి శ్రీనివాసు, మాజీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, పట్టణ మహిళా అధ్యక్షురాలు పాలిక కుసుమ, మండల పార్టీ అధ్యక్షుడు తలారి దొరబాబు, గోపు మురళి, పుట్టా సూరిబాబు, ఇరుసుమళ్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

దండుగా.. ఉద్యమంగా

ఏలేశ్వరం: ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పిలుపుమేరకు 'అన్నదాత పోరు'లో భాగంగా మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు పెద్దాపురం తరలివెళ్లారు. పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల నుంచి వందలాదిగా అన్నదాత పోరుకు తరలివెళ్లారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి బయలుదేరిన పార్టీ శ్రేణులు కిర్లంపూడి చేరుకొని గిరిబాబుతో కలిసి ర్యాలీగా పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్నారు. ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ, చంద్రబాబు ప్రభుత్వంలో రైతులకు కష్టాలు తప్పవన్నారు. ఎరువుల కృత్తిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో రైతులకు ఎన్నడూ ఎరువుల కొరత రాలేదన్నారు. రైతుల సమస్యలు గుర్తించి ముందుగా ఎరువులు, విత్తనాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి, జెడ్పీటీసీలు బెహరా రాజేశ్వరీ, గొల్లు చినదివాణం, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, పార్టీ నేతలు బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, శిడగం వెంకటేశ్వరరావు, సుంకర రాంబాబు, వాగు బలరామ్, పైల విజయ్‌కుమార్, కోరాడ ప్రసాద్, గొల్లపల్లి సురేష్, కాశీ విశ్వనాథ్, బీశెట్టి అప్పలరాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: 'అన్నదాత పోరు'లో భాగంగా ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో మంగళవారం భారీ బైక్ ర్యాలీతో పెద్దాపురం ఆర్డీవో ఆఫీసుకు బయలుదేరారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం నివాసానికి ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు చేరుకున్నారు. అనంతరం బైక్, కార్ల ర్యాలీ మధ్య గిరిబాబు బయలుదేరారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట కో–ఆర్డినేటర్ తోట నరసింహం ఆదేశాలతో కిర్లంపూడి మండలం నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు ఆర్డీఓ కార్యాలయానికి బయలుదేరారు.

గోకవరం: పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి మంగళవారం గోకవరం మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి తోట నరసింహం, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లీ వీరబాబు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి అక్షింతల రాజా, నాయకులు నరాలశెట్టి నరసయ్య, అంబటి అబ్రహం, నండూరి గోపి భాస్కర్, పాటి వివేక్, బొడ్డపాటి వీరచంద్రం, పాలిక కుమార్, గూడుపు చిన్న, పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: యూరియా బ్లాక్ మార్కెట్‌ను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి కోటనందూరు మండలం నుంచి ఆ పార్టీ నేతలు మంగళవారం భారీగా తరలివెళ్లారు. పార్టీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఎంపీపీ లగుడు శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో మండలంలోని 17 పంచాయతీల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతులకు న్యాయం జరిగే వరకూ వారికి అండగా పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు లంక ప్రసాద్, గొర్లి రామచంద్రరావు, బొంగు ఉమారావు, కొరుప్రోలు కృష్ణ, కుంచే అచ్చిరాజు, రుత్తల జోగిరాజు, బొత్స సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి ఘన సత్కారం



ప్రత్తిపాడులో స్వప్న దంపతులను సత్కరిస్తున్న రాజబాబు, ఉపాధ్యాయులు

ప్రత్తిపాడు: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందుకున్న పాలూరి స్వప్నను మండల ఉపాధ్యాయ వర్గం ఘనంగా సత్కరించింది. ప్రత్తిపాడు సరయు ఫంక్షన్ హాలు ఆవరణలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మాన సభ జరిగింది. ఈసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ రాజబాబు మాట్లాడుతూ, అవార్డులు ఉద్యోగి బాధ్యతలను పెంచుతాయన్నారు. ఏ ఉద్యోగి అయినా విధి నిర్వాహణలో ప్రజల మన్ననలను పొందాలని ఆయన సూచించారు. ఎంఈఓ–2 అచ్చిరాజు, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కోడి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ, ఎయిడెడ్ స్కూల్ నుంచి వాకపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయిన స్వప్న విద్యార్థులకు విద్య అందించడంలో ప్రజల మెప్పు పొందారని కొనియాడారు. ఉపాధ్యాయులు, స్నేహితులు స్వప్న దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సీహెచ్ సూర్యావతి, రాపర్తి రామలింగేశ్వరుడు, రమణ, సీఆర్పీలు రాంజీ, అప్పన మల్లేష, టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు ఏలూరి వెంకటరమణ, లయన్స్ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ పోరాటం

గోకవరం: విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ పోరాటం చేస్తుందని మండల యూటీఎఫ్ నాయకులు అన్నారు. మండలంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అహ్మద్ షరీఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యాహక్కు చట్టం ప్రపంచ బ్యాంకు సాల్ట్ పథకం అమలు పేరుతో మూడో వంతు ప్రైమరీ స్కూళ్లు ఇప్పటికీ సింగిల్ టీచర్ స్కూలుగా మారిపోయాయన్నారు. బోధనేతర కార్యక్రమాలు చుట్టూ ఉపాధ్యాయులను ఊపిరి ఆడకుండా చేస్తున్నారన్నారు. స్వచ్ఛందం అంటూనే ఉపాధ్యాయులను బలవంతంగా నిర్బంధిస్తున్నారని, పరీక్షల మూల్యాంకనాన్ని ఉపాధ్యాయులకే పరీక్షగా మార్చేశారన్నారు. 12వ పీఆర్సీ కమిషనర్ రాజీనామా చేసి 15 నెలలు గడిచిన మరొకరిని నియమించలేదన్నారు. సీపీఎస్‌ని రద్దు చేసి ఓపీఎస్‌గా మార్చేందుకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. ఈనెల 25న విజయవాడలో బహిరంగ సభ నిర్వహించి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి అల్టిమేట్ ఇవ్వడం ద్వారా రణభేరి మోగించాలని నిర్ణయించిందన్నారు. అనంతరం రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరనాథ్, పంతం త్రిమూర్తులు, జిల్లా కార్యదర్శి నాగభూషణం, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నేడు మండల పరిషత్ సమావేశం

కోటనందూరు: గ్రామంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటనారాయణ మంగళవారం తెలిపారు. ఎంపీపీ లగుడు శ్రీనివాస్ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో మండలాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై చర్చించామన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు నిర్ణీత సమయానికి హాజరుకావాలని కోరారు.

బాలల చట్టాలపై శిక్షణ

జగ్గంపేట: బాలల పరిరక్షణ, చట్టాలపై శిక్షణా కార్యక్రమాన్ని జగ్గంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. గ్రామ స్థాయి బాలల సంక్షేమ సంఘాలు, పరిరక్షణ కమిటీ అధికారులకు నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీఓ చంద్రశేఖర్ మాట్లాడారు. బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత గ్రామస్థాయి కమిటీ అధికారులకు ఉందని తెలిపారు. బాల్య వివాహాలు అరికట్టడానికి విస్తృత స్థాయి ప్రచారం నిర్వహించాలని అన్నారు. బాల్య వివాహాలు చేసిన, వాటికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అటువంటి వారికి ప్రభుత్వ పథకాలు రద్దు చేస్తామని తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకటరావు బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో దివ్యాంగులకు ప్రయోజనం



తొండంగిలో దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న డాక్టర్ సందీప్

తొండంగి: పుట్టుకతో అంగవైకల్యం ఉన్నప్పటికీ ఫిజియోథెరపీ అందించడం ద్వారా దివ్యాంగులకు మెరుగైన మార్పు ఉంటుందని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సందీప్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించారు. 20 మంది దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహించి సంరక్షకులకు పలు సూచనలు చేశారు. సరైన పోషకాహారంతో పాటు ఫిజియోథెరపీ నిర్వహించడం ద్వారా దివ్యాంగుల్లో మెరుగైన మార్పు వస్తుందన్నారు. కార్యక్రమాన్ని ఎంఈవో షేక్‌బాబ్జి పరిశీలించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంపీడీఓ నారాయణకు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

కోటనందూరు: కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఆ మేరకు ఎంపీడీఓ వెంకటనారాయణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. తమ సర్వీసు ఆరేళ్లు ముగుస్తున్నా నేటికీ ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు లేవని, డిప్యూటేషన్‌పై పని చేసిన ఉద్యోగులకు టీఏ, డీఏలు ఇవ్వలేదని, డిపార్టుమెంట్ వారీగా నిర్దిష్ట జాబ్‌చార్ట్ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనిభారం తగ్గించాలని, ఉద్యోగానికి తగిన బాధ్యతలు మాత్రమే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకి విజ్ఞప్తి చేశారు.

మురళీకృష్ణంరాజుకు మహిళా నేతల సంఘీభావం



ధర్మవరంలో మురళీకృష్ణంరాజును కలిసి సంఘీభావం తెలుపుతున్న వర్ధినీడి సుజాత

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, ఆయన తండ్రి రామరాజును మంగళవారం ఆయన స్వగృహమైన ధర్మవరంలో ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, పిఠాపురం, యు.కొత్తపల్లి మండల అధ్యక్షులు రాసంశెట్టి భవాని, ఆలపు సుధారాణి, పిఠాపురం నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు శ్రీనివాసరావు తదితరులు కలిసి సంఘీభావం తెలిపారు. మండలంలోని శరభవరం ఎంపీటీసీ అమరాది కాశీ, వైఎస్సార్ సీపీ నాయకులు రంగనాధం అబ్బాయి తదితరులు సంఘీభావం తెలిపి మద్దతుగా నిలిచారు. 86 ఏళ్ల రామరాజుపై అక్రమ కేసు పెట్టడం దారుణమని, ఆయనకు తామంతా అండగా ఉంటామని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ సెల్ జాయింట్ సెక్రటరీగా గోవిందు

తుని: వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా కోటనందూరు మండలం అప్పలరాజుపేటకు చెందిన నల్లమిల్లి గోవిందు, రైతు విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా తునికి చెందిన వెలగా ఈశ్వరరావు ఎంపికయ్యారు. ఆ మేరకు మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా సిఫార్సుతో వీరికి పదవులు దక్కాయి. వారికి వైఎస్సార్ సీపీ శ్రేణులు అభినందనలు తెలిపారు.



నల్లమిల్లి గోవిందు



వెలగా ఈశ్వరరావు

యూరియా నిల్వల తనిఖీ

గోకవరం: మండలంలోని యూరియా నిల్వలను రాజమహేంద్రవరం ఆర్డీఓ కృష్ణనాయక్ మంగళవారం తనిఖీ చేశారు. తొలుత గోకవరం విశాల సహకార పరపతి సంఘంలో యూరియా నిల్వలను తనిఖీ చేసి రైతులకు యూరియా సరఫరా జరుగుతున్న తీరును పరిశీలించారు. అలాగే కామరాజుపేట సొసైటీ కార్యాలయంలో యూరియా నిల్వలు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ, మండలంలో యూరియా నిల్వలు 220 మెట్రిక్ టన్నులు ఉన్నాయని రైతులకు సరఫరా చేసే విషయంలో ఎటువంటి జాప్యం చేయకూడదని సిబ్బందికి సూచించారు. సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ రామకృష్ణ, గోకవరం సొసైటీ సీఈఓ దాసరి సురేష్, ఇతర సిబ్బంది ఉన్నారు.



గోకవరంలో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణనాయక్